క్లుప్తంగా

శింగరకొండలో శృంగేరి పీఠాధిపతి పూజలు



భక్తులకు ప్రసాదం అందజేస్తున్న స్వామీజీ

అద్దంకి రూరల్: శింగరకొండ క్షేత్రాధిపతి కొండపై కొలువై ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సోమవారం సాయంత్రం శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి స్వామి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన ఈవో పీ. శ్రీనివాసరావు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

లో వోల్టేజీ, విద్యుత్ కోతలు నివారించాలి

వేటపాలెం: గ్రామంలో ఏడు నెలలుగా లో వోల్టేజీ, విద్యుత్ కోతలతో ప్రజలు సతమతమవుతున్నారని జిల్లా కలెక్టర్ మురళికి వినతి పత్రం అందించారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరుతూ పందిళ్లపల్లి గ్రామస్తులు స్పందనలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ బీసీ సెల్ ప్రెసిడెంట్ సాదు రాఘవ సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామన్నపేట విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి గ్రామానికి కావాల్సినంత విద్యుత్ సరఫరా కాకపోవడం, వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ పెరగడంతో తరచూ లో వోల్టేజీ సమస్య వస్తుందన్నారు. దీని వల్ల విద్యుత్ గృహో పకరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు దెబ్బతిని ఆర్థిక భారంగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను తగినంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించినట్లు రాఘవ తెలిపారు.

6వ తరగతి విద్యార్థులకు సీట్ల కేటాయింపు

చీరాల అర్బన్: ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి విద్యార్థులకు సీట్లు కేటాయింపు పూర్తయినట్లు ప్రిన్సిపాల్ జె.సరళ సోమవారం తెలిపారు. ఏప్రిల్ 21న రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలైన విషయం విదితమే. జిల్లా కలెక్టర్ జే వెంకటమురళి చైర్మన్‌గా, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, ప్రిన్సిపాల్ జె.సరళ సభ్యులుగా ఏర్పడిన సెలక్షన్ కమిటీ ఫలితాల ఆధారంగా రిజర్వేషన్ ప్రకారం విద్యార్థులకు సీట్లు కేటాయించినట్లు తెలిపారు. మొత్తం 100 సీట్లకు గాను 100 మందికి సీట్లు కేటాయించారు. ఎంపికైన విద్యార్థుల వివరాలు స్కూల్ నోటీస్ బోర్డులో ప్రదర్శించామన్నారు. అలానే విద్యార్థులకు ఫోన్ ద్వారా తెలియచేస్తామని, సర్టిఫికెట్లతో విద్యార్థులు స్కూల్‌లో చేరవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

వెంకన్న పాదాలకు ప్రత్యేక పూజలు



అలంకరణలో నామాలు, శంఖుచక్రాలు

బల్లికురవ: మండల కేంద్రం వెంకటేశ్వర స్వామి పాదాలకు సోమవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. వైశాఖ మాసం సప్తమి సందర్భంగా స్వామివారి శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని వేదపండితులు జీ. పవన్‌కుమార్ శర్మచే శంఖుచక్ర నామాలు, పాదాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఏప్రిల్ 14న నూతనంగా నిర్మించిన వెంకన్నస్వామి మందిరంలో ప్రతిరోజు పూజలతోపాటు శనివారం భజనలు చేపడుతున్నారు. కార్యక్రమంలో పెండ్యాల కాంతారావు, చల్లగుండ్ల శ్రీనివాసరావు దంపతులతో పాటు గ్రామంలోని భక్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుదాం, ప్రకృతిని కాపాడుదాం



మొక్కలు నాటుతున్న తహసీల్దారు, ఎంపీడీఓ, సర్పంచ్‌లు

కారంచేడు: గ్రామాల్లోని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించేలా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని, అప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తహసీల్దారు జీ నాగరాజు అన్నారు. సోమవారం ఆయన మండలంలోని స్వర్ణ గ్రామంలో కొమ్మమూరు కాలువ సమీపంలోని చెత్తా, చెదారాలతో నిండి ఉండే ప్రదేశంను శుభ్రం చేయించారు. అక్కడ ఒక చిన్న పార్కు మాదిరిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీడీఓ కే నేతాజీ ఆధ్వర్యంలోని గ్రామ సర్పంచ్ మోటాని మధుసూదనరావు సహకారంతో కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లేని సిబ్బంది.. ప్రజలకు ఇబ్బంది !

- మండలంలో సర్దుబాటు పేరిట సచివాలయ సిబ్బంది తగ్గింపు
- రేషన్ కార్డుల కోసం ప్రజల ఇక్కట్లు
- ఇన్‌చార్జ్‌ల వ్యవస్థతో దరఖాస్తుదారుల అగచాట్లు



వలపర్ల సచివాలయంలో పడిగాపులు కాస్తున్న రేషన్ కార్డు దరఖాస్తుదారులు

మార్టూరు: అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా కూటమి ప్రభుత్వం సంక్షేమ పాలనలో మీనమేషాలు లెక్కిస్తోంది. అటు సంక్షేమం.. ఇటు పాలన మరిచి అబద్ధపు ప్రచారాలతో కాలం గడుపుతోంది కాని ఒక్క హామీ నెరవేర్చిన పథకం లేదని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. పథకాలు రావాలన్నా రేషన్‌కార్డు కీలకం. దీని కోసం పేద, మధ్య తరగతి కుటుంబాలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నూతన రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నాం.. దరఖాస్తు చేసుకోండి అంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలు గుప్పించిన సంగతి తెలిసిందే. రేషన్ కార్డుల కోసం చాలా కాలంగా ఆశగా ఎదురు చూస్తున్న అర్హులైన ప్రజలు దరఖాస్తు చేసుకోవడం కోసం దగ్గరకు వెళ్లగా వారికి నిరాశ ఎదురవుతోంది. అందుకు కారణం సచివాలయాలలో తగినంత సిబ్బంది లేక తమను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రభుత్వం సర్దుబాటు పేరుతో సిబ్బందిని తగ్గించడంతో కొన్నిచోట్ల ఇన్‌చార్జిలతో పని చేయిస్తున్నారు. దీంతో ఆ సిబ్బంది ఒత్తిడికి గురవుతూ చేతులెత్తేస్తున్నట్లు సమాచారం. మండలంలో 18 సచివాలయాలు ఉండగా గతంలో 198 ఉద్యోగులు ఉండేవారు. ఈప్రభుత్వంలో ఉద్యోగులను సర్దుబాటు చేయడంతో 130 మంది మాత్రమే ఉన్నారు.

సిబ్బంది లేక.. సేవలు అందక..

మండలంలోని వలపర్ల గ్రామంలో సుమారు పదివేల మంది జనాభా ఉన్నారంటే రేషన్ కార్డు దరఖాస్తులు ఏ స్థాయిలో ఉంటాయో ఊహించవచ్చు. ఇక్కడ రెండు సచివాలయాలు ఉన్నా సరిపడా సిబ్బంది లేరు. సచివాలయం-1లో డిజిటల్ అసిస్టెంట్ సుమారు రూ.75 వేలు అర్జీదారుల సర్వీస్ చార్జి సొమ్మును సొంతంగా వాడుకున్నాడు. మార్చి 28వ తేదీ తన సంతకం లేకుండా అనారోగ్య కారణంగా విధులకు హాజరు కాలేకపోతున్నానంటూ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి హరిబాబుకు మెయిల్ పెట్టి వెళ్లి ఇంతవరకు హాజరు కాలేదు. అదే సచివాలయంలోని వెల్ఫేర్ అసిస్టెంట్ సైతం కొంత మొత్తాన్ని సొంతంగా వాడుకొని గత ఫిబ్రవరి నెల 13వ తేదీ నుంచి మార్చి నెల మూడో తేదీ వరకు తన భార్య డెలివరీ టైం కనుక మెటర్నిటీ లీవ్ పెడుతున్నట్లు వెళ్లి ఇంతవరకు హాజరు కాలేదు. ప్రస్తుతం కోనంకి డిజిటల్ అసిస్టెంట్ సచివాలయం- 2, ఇసుక దర్శి డిజిటల్ అసిస్టెంట్ వలపర్ల సచివాలయం-1కు ఇన్‌చార్జిలుగా వేసి బండి నడిపిస్తున్నారు. ఇక సచివాలయం-2లో పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసు ఎవరూ లేకపోవడంతో ప్రజలకు సేవలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సచివాలయం-1లో ఇంజినీరింగ్ అసిస్టెంట్, వీఆర్ఓ, డిజిటల్ అసిస్టెంట్ ఇన్‌చార్జిలతోనే నడుస్తుండటం గమనార్హం. ఈ పరిస్థితి కేవలం వలపర్ల గ్రామంలో మాత్రమే కాక మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో లేక నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. సర్దుబాట్ల నెపంతో సచివాలయ సిబ్బందిని తగ్గిస్తూ సచివాలయాలలో ప్రజలకు సేవలు అందక పోవడానికి కారణం ప్రభుత్వమే అంటూ ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డుల దరఖాస్తు సంబంధించిన వెబ్‌సైట్ మూసి వేశాక తమను ఎవరు ఆలకిస్తారని, సరైన సమయంలో సిబ్బందిని నియమించి తమ దరఖాస్తులను స్వీకరించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

> **సిబ్బంది లేక ఇన్‌చార్జిలతో కొనసాగిస్తున్నాం..**
> వలపర్ల గ్రామంలోని రెండు సచివాలయాల్లో కొంతమంది సిబ్బంది లేరు. మరికొందరు సెలవుపై వెళ్లిపోయారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఇన్‌చార్జిలతో రాత్రిపూట కూడా రేషన్ కార్డు దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు కృషి చేస్తున్నాం.
> – హరిబాబు, వలపర్ల పంచాయతీ కార్యదర్శి

> **అర్జీ ఇవ్వడం ఉదయం నుంచి కోసం వేచి ఉన్నా..**
> ఎంతో ఆశతో రేషన్ కార్డుకు దరఖాస్తు చేద్దామని కావాల్సిన ఆధారాలతో ఉదయం అనగా వచ్చాను. సంబంధిత అధికారులు లేరని దరఖాస్తు తీసుకోకపోవడంతో వెనక్కి వెళ్తున్నాను. అధికారులు మా పరిస్థితిని గమనించి తగు చర్యలు తీసుకొని రేషన్ కార్డులు ఇప్పించాల్సిందిగా కోరుతున్నాం.
> – షేక్ హుస్సేన్, స్థానికుడు

కుంభాభిషేకంలో ఆకట్టుకున్న నృత్యాలు

అద్దంకి/అద్దంకిరూరల్:

శింగరకొండ క్షేత్రం మహా కుంభాభిషేకంలో భాగంగా సోమవారం నిర్వహించిన శోభాయాత్ర కార్యక్రమం ప్రజలు విశేషంగా ఆకట్టుకుంది. అదే విధంగా యాత్రలో నిర్వహించిన కరళ వాయిద్యాలు, విచిత్ర వేషధారణల ప్రదర్శనలు, ప్రత్యేక నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అందరూ జై శ్రీరామ్.. జై వీరాంజనేయ అంటూ భక్తిభావంతో ముందుకు సాగారు. క్షేత్రంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులను కుంభాభిషేకం కోసం తెచ్చిన మేనక అనే ఏనుగు అందరినీ ఆకర్షించింది.



మేనక (ఏనుగు)తోసాగుతున్న శోభాయాత్ర



క్యూలైన్లో కిక్కిరిసిన భక్తులు



నృత్యం చేస్తున్న కళాకారులు

ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతం



చిరుధాన్యాలు చల్లుతున్న రైతులు, అధికారులు

చీరాల టౌన్: రైతులు విధిగా పంటల సాగుకు ముందుగా భూసారాన్ని పెంచే చిరుధాన్యాలను సాగు చేయడం వలన పంటలు ఏపుగా పెరిగి సాగు ఖర్చులు కూడా తగ్గి దిగుబడులు పెరుగుతాయని చీరాల డివిజన్ ప్రకృతి వ్యవసాయ అధికారి భారతి సూచించారు. సోమవారం మండలంలోని తోటవారిపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటుగా 18 రకాల చిరుధాన్యాలను పంటల సాగుకు ముందు భూమిలో విత్తనాలు చల్లడంపై అవగాహన కల్పించి క్షేత్రస్థాయిలో వివరించారు. కార్యక్రమంలో మాజీ వ్యవసాయ సలహామండలి చైర్మన్ కె.రమణారెడ్డి, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది కవిత, స్వరూప, పావని, నాగలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సంతమాగులూరు (అద్దంకి రూరల్):

తాటి చెట్టుపై నుంచి కిందపడి గాయాల పాలై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై పట్టాభిరామయ్య వివరాల మేరకు.. సంతమాగులూరు మండలంలోని మిన్నెకల్లు గ్రామానికి చెందిన ఆంజనేయులు (25) తోటి స్నేహితులతో కలిసి ఈనెల 6వ తేదీన గ్రామ శివారులో తాటికాయలు సేకరించడానికి వెళ్లారు. చెట్టు ఎక్కి తాటికాయలు కోసే పనిలో నిమగ్నమై ఉండగా ప్రమాదవశాత్తు ఆంజనేయులు చెట్టు నుంచి కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వైద్యశాలనుంచి వచ్చిన సమాచారం ప్రకారం మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పటిష్టంగా ఓటర్ క్లైమ్‌ల విచారణ



రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న ఆర్డీవో

చీరాల టౌన్: నియోజకవర్గంలో ఓటరు క్లైమ్‌ల విచారణ పటిష్టంగా బీఎల్‌వోలతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని ఈఆర్‌వో, ఆర్డీవో టి.చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. సోమవారం చీరాల తహశీల్దార్ కార్యాలయంలో అన్నీ రాజకీయ పార్టీల నాయకులతో ఓటరు క్లైమ్‌ల విచారణలపై ఆర్డీవో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. 106 చీరాల నియోజకవర్గంలో ఓటరు క్లైమ్‌ల అర్జీలు పెండింగ్‌లో లేకుండా బీఎల్‌వోలు సమర్థవంతంగా పనిచేస్తున్నారని, రాజకీయ పార్టీల నాయకులు తమ బూత్ ఏజెంట్లతో విచారణ చేయించుకోవచ్చన్నారు. సమస్యలను తనకు గానీ, ఏఈఆర్వోలకు గాని తెలియజేయాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ కె.గోపికృష్ణ, వేటపాలెం తహశీల్దార్ పాలపర్తి పార్వతి, డీటీ సుశీల పాల్గొన్నారు.

కారంచేడులో నీట మునిగిన రహదారులు



బ్యాంక్ సెంటర్‌లో నీట మునిగిన రహదారి

కారంచేడు: గంటకు పైగా దంచి కొట్టిన వర్షంతో కారంచేడు మండలంలోని పలు గ్రామాల్లోని రహదారులు నీట మునిగాయి. సోమవారం ఉదయం మండల కేంద్రమైన కారంచేడుతో పాటు కుంకలమర్రు, స్వర్ణ, ఆదిపూడి, యర్రంవారిపాలెం గ్రామాల పరిధిలో ఊహించని రీతిలో వర్షం పడింది. ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోడ్లపైన వ్యాపార చేసుకొనే చిరువ్యాపారుల అవస్థలు వర్ణనాతీతం. కూరగాయల కొట్లు, పండ్ల వ్యాపారులు సైతం ఇబ్బందులు పడ్డారు. కారంచేడు యూనియన్ బ్యాంక్ సెంటర్‌లో ప్రధాన రహదారిలో నీరు నిలిచి పోయింది.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహిస్తున్న భక్తులు

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని నాగండ్ల గ్రామంలో వేంచేసియున్న గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. ప్రధానాత్ ఆధ్వర్యంలో శతాధిక ప్రతిష్ఠాచార్యులు మూలంరాజు రాజ్‌కుమార్ శర్మ శివాచార్య ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ పూజా కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలను వేద మంత్రాల నడుమ నిర్వహించారు. అనంతరం ధ్వజ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ జరుగుతున్న సమయంలో వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు తడుస్తూ ఆనందంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగ కుండా కార్యనిర్వాహణాధికారి మీనిశెట్టి శ్రీనివాసరావు, భక్తకమిటీ అన్ని ఏర్పాట్లను కల్పించారు.

స్వర్ణమ్మ తల్లికి పసుపు, కుంకుమ

స్వర్ణ (కారంచేడు): గ్రామ దేవతగా విరాజిల్లుతున్న స్వర్ణమ్మ తల్లికి గ్రామ ఆడపడుచులు పెద్ద ఎత్తున పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ దేవత స్వర్ణమ్మ తల్లి 32వ తిరునాళ్లను పురస్కరించుకొని సోమవారం ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రారంభం రోజున గ్రామంలోని ఆడపడుచులు గ్రామానికి వచ్చి తమ కోరికలు తీర్చే స్వర్ణమ్మకు పసుపు కుంకుమలు సమర్పించడం ఆనవాయితీ. ఎస్‌ఐ వీ వెంకట్రావు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

స్వర్ణమ్మ తల్లి తిరునాళ్లకు ఏర్పాట్లు



స్వర్ణమ్మ తల్లి కమిటీ సభ్యులతో సమావేశమైన ఎస్సై వెంకట్రావు

స్వర్ణ (కారంచేడు): మండలంలోని స్వర్ణ గ్రామ దేవతగా విరాజిల్లుతున్న స్వర్ణమ్మ తల్లి తిరునాళ్లను కన్నుల పండువగా నిర్వహించేలా ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, తిరునాళ్ల కమిటీ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని స్వర్ణ గ్రామంలో కారంచేడు ఎస్‌ఐ వీ వెంకట్రావు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఏటా తిరునాళ్లకు గ్రామ ఆడపడుచులతో పాటు, మహిళలు, భక్తులు, ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతుంటారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు ముమ్మరంగా చేపట్టాల్సి ఉందని ఆయన తెలిపారు. అలాగే రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న ఎద్దుల పోటీల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

రేపు డీఈవో కార్యాలయాల ముట్టడి



డీఈఓ కార్యాలయాల ముట్టడిని ప్రకటిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

చీరాల: బదిలీల పదోన్నతులకు సంబంధించి అసంబంధమైన విధానాలను రద్దు చేసి కొత్త జీవోలను విడుదల చేసి బదిలీలు, పదోన్నతులు జరపాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ మండలాల భవనంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి యూటీఎఫ్, ఏపీటీఎఫ్, ఏపీ టీచర్స్ గిల్డ్ ప్రతినిధులు హాజరయ్యారు. బదిలీలు, పదోన్నతులపై ఈనెల 21న పాత జిల్లాల కేంద్రాలలో పెద్ద ఎత్తున డీఈఓ కార్యాలయ ముట్టడి కార్యక్రమం జరుగుతుందని, ఉపాధ్యాయులందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బండి బిక్షాలుబాబు, ఏపీటీఎఫ్ నాగమల్లేశ్వరరావు, హెచ్ఎం అసోసియేషన్ తరఫున గుమ్మ శ్రీనివాసరావు, ఎస్టీయూ తరఫున జి.ఏ సురత్నం పాల్గొన్నారు.

మార్టూరు: అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21వ తేదీ ఉమ్మడి ప్రకాశం జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిచేయనున్నట్లు ఐక్యవేదిక నాయకులు సోమవారం సాయంత్రం తెలిపారు. స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద సోమవారం సాయంత్రం నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మాడుగుల కిషోర్, వై రాజారావు, షేక్ జాన్ బాషా, యుటిఎఫ్ నాయకులు లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మరక్షణలో ఆదిశంకరాచార్యుల కృషి



వీరాంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న మహాస్వామి

ఇంకొల్లు(చినగంజాం): సనాతన ధర్మాన్ని కాపాడేందుకు, ప్రజలలో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు జగద్గురు ఆదిశంకరాచార్యుల వారు విశేషంగా కృషి చేశారని శృంగేరీ శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతిస్వామి అన్నారు. ఇంకొల్లు మండల పరిధిలోని పావులూరు పొలిమేర ఆంజనేయ స్వామి దేవాలయాన్ని ఆయన సోమవారం సందర్శించారు. మాజీ దేవదాయ శాఖా మంత్రి గాదె వెంకటరెడ్డి ఆయనను ఆలయంలోనికి స్వాగతం పలికారు. ఆలయాన్ని సందర్శించిన ఆయన ముందుగా పొలిమేర వీరాంజనేయ స్వామికి పూజా కార్యక్రమాలను నిర్వహించి, హారతులు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మాణం చేసిన ముఖ మండపాలు, అతిథి గృహాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు భక్తుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, అందరికీ ఆధ్యాత్మికత ముఖ్యమైనదిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పర్చూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి, వెంకారెడ్డి, భక్త కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం ఆదర్శం

అద్దంకి రూరల్: పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శమని సీపీఐ అద్దంకి సీనియర్ నాయకుడు కే రఘుచందర్ అన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవన్‌లో రక్షిత భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. అద్దంకి పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుతగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం నిర్వహించారన్నారు. కార్యక్రమంలో షేక్ కరీం, బీ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు జోహార్లు..

పర్చూరు(చినగంజాం): కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యకు పలువురు నాయకులు జోహార్లు అర్పించారు. సోమవారం పర్చూరు బొమ్మల సెంటర్‌లో ఆయన వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ సోదరుడు హరిబాబు జ్ఞాపకార్థం 900 మందికి ఉచితంగా మజ్జిగ, పాయసం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీ ప్రద్యుమ్నకుమార్, రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, రోటరీ సభ్యులు గడ్డిపాటి శ్రీనివాసరావు, నాగబైరు శ్రీనివాసరావు, సీపీఎం జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చీరాల: స్వాతంత్ర సమరయోధుడు, భారత కమ్యూనిస్టు ఉద్యమ నేత, సీపీఎం పార్టీ వ్యవస్థాపకులు పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సభను సోమవారం స్థానిక బాపనమ్మ కళ్యాణ మండపంలో సీపీఎం పార్టీ నాయకులు ఐవి ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.నారపరెడ్డి, సుందర్, రంగారావు, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

యానాదుల కుటుంబాలను ఆదుకుంటాం

చీరాల టౌన్: యానాదులకు ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించడంతో పాటుగా వారికి ప్రభుత్వ పథకాలు, గుర్తింపు కార్డులు అందించి ఆదుకుంటామని చీరాల ఆర్డీవో తూమాటి చంద్రశేఖర నాయుడు తెలిపారు. సోమవారం చీరాల ఆర్డీవో కార్యాలయంలో జరుగుతున్న పీజీఆర్ఎస్‌లో మండలంలోని బుర్లవారిపాలెం స్ట్రయిట్ కట్‌పై నివశించే 20 యానాది కుటుంబాలు కొత్తపేటలో రోడ్డు వెంట నివశించడం, ఆధార్‌కార్డులు, ప్రభుత్వ పథకాలకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో బీఎస్‌పీ నియోజకవర్గ ఆధ్వర్యంలో ఆర్డీవోను కలిసి సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. ఆర్డీవో మాట్లాడుతూ.. యానాదులకు ప్రభుత్వం రావాల్సిన వివిధ గుర్తింపు కార్డులు అందించడంతో పాటుగా సమస్యలన్నింటిని రెండువారాల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఎస్‌పీ నాయకులు కె.మార్క్, అర్జునరావు, సుబ్బారావు, తదితరులు ఉన్నారు.

మహిళకు అస్వస్థత

మార్టూరు: జాతీయ రహదారిపై ఆకస్మికంగా అస్వస్థతకు గురైన ఓ ప్రయాణికురాలిని హైవే మొబైల్ పోలీస్ సకాలంలో స్పందించి ఆసుపత్రిలో చేర్పిన ఘటన సోమవారం ఉదయం బొల్లాపల్లి టోల్‌గేట్ వద్ద జరిగింది. మొబైల్ సిబ్బంది రవి వివరాల మేరక.. ఒంగోలు వైపు నుంచి నూజివీడు వైపుకారులో వెళ్తున్న ఓ కుటుంబం బొల్లాపల్లి టోల్‌గేట్ వద్ద కాలకృత్యాలు తీర్చుకోవడం కోసం ఆగింది. ఈ క్రమంలో కారులోని ఓ మహిళకు అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి తీవ్ర అనారోగ్యానికి గురైన విషయం గమనించిన హైవే మొబైల్ సిబ్బంది తక్షణమే ఆమెను తమ వాహనంలో చిలకలూరిపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళను కాపాడినందుకు ఆమె బంధువులు హైవే మొబైల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.